స్పందించే వరకూ సమ్మె

17 రోజుకు అంగన్వాడీల పోరు

- 6లో

భీమవరంలో పోస్టుకార్డులతో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

సిఎం సారూ.. హామీలు మరిచారు..!

- అగమ్యగోచరం వాటర్‌గ్రిడ్ నిర్మాణం
- అదేబాటలో నరసాపురంలో ఫిషింగ్ హార్బర్, వశిష్టవారధి
- అటకెక్కిన కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం
- భీమవరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు గాలికే
- దిక్కుతోచని స్థితిలో పోలవరం నిర్వాసితులు
- నేడు భీమవరంలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పలు హామీలు గుప్పించడం.. తర్వాత అవి కార్యాచరణకు నోచుకోకపోవడం పరిపాటిగామారింది. అధికారంలోకొచ్చాక సిఎం జగన్ ఇచ్చిన ప్రధానమైన హామీల్లో ఏ ఒక్కటీ నాలుగున్నరేళ్లు గడిచినప్పటికీ అమలుకాని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రిస్థాయిలో ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంపై జిల్లా ప్రజానీకంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. శుక్రవారం భీమవరానికి సిఎం విచ్చేస్తుండటంతో సిఎం సారూ.. హామీలు మరిచారంటూ జనం చర్చించుకుంటున్నారు.

2019 ఎన్నికల ముందు భీమవరం ప్రాంతంలో సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా కలుషిత తాగునీటి సమస్యపై జగన్ అప్పటి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈనీళ్లు ఎవరైనా తాగుతారా అంటూ బాటిల్‌లో పట్టిన నీరు చూపించేవారు. తాము అధికారంలోకి వస్తే గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీటిని అందిస్తామంటూ హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత రూ.3,200 కోట్లుతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేయనున్నట్లు హడావుడి చేశారు. తర్వాతకొంత కాలానికి విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రమే రూ.1400 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. జగన్ సిఎంగా బాధ్యతలు చేపట్టి నాలుగున్నరేళ్ల గడిచిపోయింది. మరో మూడునెలల్లో మళ్లీ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటివరకూ వాటర్‌గ్రిడ్ పథకం అమలుకు నోచుకోలేదు. కలుషిత తాగునీటినే తాగుతూ జనం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సొమ్ములు ఖర్చుపెట్టి తాగునీరు కొనుగోలు చేసుకుని బతుకులు నెట్టుకొస్తున్నారు. ఐదేళ్లకాలంలో కూడా తాగునీటి హామీ నెరవేర్చకపోవడంపై ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిఎం శుక్రవారం భీమవరం వస్తుండటంతో సిఎం ఇచ్చిన హామీలను అంతా గుర్తుచేసుకుంటున్నారు. 2022 నవంబర్ 21న మత్స్యకారులు దినోత్సవం సందర్భంగా నరసాపురంలో సిఎం పర్యటించారు. రూ.3,300 కోట్లకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అందులో ఎన్నిపూర్తిచేశారో నాయకులే చెప్పాల్సి ఉంది. బియ్యపుతిప్పవద్ద ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవితాలను మార్చేస్తామన్నారు. ఇప్పటి వరకూ దానిఊసేలేకుండాపోయింది. ఆక్వా యూనివర్శిటీకి సంబంధించి ఇప్పటికీ భవనాలు పూర్తికాలేదు. నరసాపురంవాసుల కలగా మిగిలిపోయిన గోదావరిపై వశిష్ట వారధి నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు. 2023 జనవరిలోనే టెండర్లు పూర్తిచేస్తామన్నారు. ఇప్పటికీ అతీగతీలేదు.

అటకెక్కిన కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం

సముద్రంలోని ఉప్పునీరు కొల్లేరులోకి ఎగదన్ని కొల్లేరు కలుషితమవుతుందని, మూడు రెగ్యులేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు 2022 మే 16న గణపవరంలో జరిగిన సభలో సిఎం చెప్పారు. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం మోళ్లపర్రు, కృష్ణాజిల్లా పడితడక వద్ద రెగ్యులేటర్ల నిర్మాణానికి రూ.470 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకూ ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. కొల్లేరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవు.

భీమవరంలో డంపింగ్ యార్డ్ హామీ గాలికి

భీమవరం పట్టణంలోని చెత్తవేసేందుకు డంపింగ్ యార్డ్ లేకపోవడం గత ఎన్నికల నుంచి పెద్ద సమస్య మారింది. నిత్యం దాదాపు 80 మెట్రిక్ టన్నులు చెత్త ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి. అప్పట్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దీనిపై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామని జగన్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు ఏమైందో ఏ ఒక్కరికీ తెలియడం లేదు.

దిక్కుతోచని స్థితిలో పోలవరం నిర్వాసితులు

రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగంచేసిన అక్కడ నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ఎన్నికల సమయంలో నిర్వాసితులకు జగన్ అనేక హామీలు గుప్పించారు. పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షలనుంచి రూ.పదిలక్షలకు పెంపుచేస్తామన్నారు. 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదులక్షల పరిహారం ఇస్తామన్నారు. కాలనీలు త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. యువతకు పరిహారం అందిస్తామన్నారు. నాలుగున్నరేళ్ల గడిచినా ఇప్పటికీ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుడా పోలవరం కాపర్‌డ్యాం పూర్తిచేశారు. దీంతో ప్రతిఏటా జులై, ఆగస్టునెలల్లో విరుచుకుపడే వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో నిర్వాసిత గిరిజనులు కట్టుబట్టలతో పునరావాస శిబిరాలకు, కొండలు, గుట్టలపైకి వెళ్లి నెలల తరబడి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి దాపురించింది. మరో మూడునెలల్లో వైసిపి ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతోంది. నిర్వాసితులకిచ్చిన హామీలు అమలు చేస్తారో లేదో తెలియడం లేదు.

నేడు సిఎం పర్యటన సాగేదిలా..

శుక్రవారం ఉదయం పదిగంటలకు సిఎం జగన్ ఇంటినుంచి కారులో హెలీప్యాడ్‌కు బయలుదేరుతారు. 10.40కు భీమవరంలోని లూథరన్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. 10.45 నుంచి 10.55 వరకూ జనంతో మాట్లాడుతారు. 11.15కు సభాప్రాంగణానికి చేరుకుంటారు. 11.15 నుంచి 12.30 గంటల మధ్య విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తర్వాత స్థానిక నాయకులను కలిసి 1.45 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి తాడేపల్లి వెళతారు.

ఆందోళనల కట్టడికి యత్నం..

ఇప్పటికే ఉద్యమకారులకు నోటీసులు జారీ

ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టిన పోలీసులు

నేతల గృహ నిర్బంధానికి రంగం సిద్ధం

జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజుకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - భీమవరం

నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భీమవరంలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు, నిరసనలు, ఆందోళనలు, ప్రదర్శనలకు తావు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ విధించి పటిష్టంగా అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఉద్యమకారులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మరి కొంతమంది నాయకులను గృహ నిర్బంధం చేసేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధమైనట్లు తెలిసింది. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సమాజంలో స్వేచ్ఛను సామాన్య పౌరులు కోల్పోయే విధంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, వామపక్షాల గొంతును అణిచివేసే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి ఉద్యమాలను అణిచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు ముఖ్యమంత్రి హోదాలో వస్తున్న జగన్ పర్యటనలో ఎటువంటి నిరసన తగలకుండా ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసింది. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ గత కొన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. ఇటీవల ఆశా కార్యకర్తలు 36 గంటల పాటు మహాధర్నా నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడించారు. మరోవైపు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్షాలు నిరంతరం ప్రజల్లో ఉంటూ ధర్నాలు, ప్రదర్శనలు ముమ్మరం చేశారు. సమగ్ర శిక్ష సిబ్బంది, మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టి కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం 36 గంటల నిరసన చేపట్టారు. ఇలా జిల్లాలో అన్ని వర్గాల కార్మికులు, ఉపాధ్యాయులు, వామపక్షాలు, ట్రేడ్ యూనియన్లు తమ సమస్యల పరిష్కారం కోసం పోరుబాటు పట్టారు. అయితే జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో ఎలాంటి నిరసనలు చేపట్టకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజుకు ఆయన స్వగృహం వద్ద పోలీసులు నోటీసులు జారీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎటువంటి నిరసనలు చేపట్టకూడదని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు నోటీసులో పొందుపరిచారు. ఇదిలా ఉంటే మరి కొంతమంది నాయకులు గృహనిర్బంధం చేసేందుకు పోలీసులు సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే వారి ఆచూకీ కోసం జల్లెడ పడుతున్నట్లు తెలిసింది. దొరికిన వారికి దొరికిన చోట తాకీదులు ఇచ్చేందుకు సమాయత్తమయ్యారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు

సభ స్థలాన్ని పరిశీలిస్తున్న కొయ్యే మోషన్‌రాజు, మంత్రి కారుమూరి, ఎంఎల్‌ఎ గ్రంధి, జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించి, విజయవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు కోరారు. ఈ నెల 29వ తేదీ శుక్రవారం ముఖ్యమంత్రి భీమవరం బహిరంగ సభలో పాల్గొని విద్యార్థులకు విద్యా దీవెన నిధులను విడుదల చేయనున్నారు. గురువారం ఈ సందర్భంగా హెలీప్యాడ్, సభావేదిక ప్రాంతాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వవిప్ గ్రంధి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎంఎల్‌సి తలశిల రఘురాం, శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్, జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్, జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి మోషేన్ రాజు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి.శ్రీనివాసరాజు, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పాల్గొన్నారు.

సిఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష

ముఖ్యమంత్రి ప్రారంభించనున్న విద్యా దీవెన కార్యక్రమం విజయవంతానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్ ఈనెల 29న జిల్లా పర్యటనను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో, జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టరు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కలిపి 20 మందితో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే సభాస్థలిలో చక్కని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఉదయం 8.30 గంటలకే ప్రదర్శనలు మొదలు పెట్టాలన్నారు. 100 బస్సులకు, 700 చిన్న బస్సులకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. విష్ణుకాలేజీ రోడ్డు కూడలిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. సభా వేదిక ప్రాంతంలో, బస్సుల్లో అల్పాహారం, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. హెలీప్యాడ్, సభాస్థలిని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి, ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాట తప్పను మడమ తిప్పనన్న జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద గురువారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి మున్సిపల్ కార్మికులతో సంప్రదించి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు గొల్లపాటి నాని, నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, ఎస్‌కె.నాగూర్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికుల మోకాళ్లపై కార్మికులు నిలబడి సమ్మెని మూడో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రతాప్, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నీలాపు ఆదినారాయణ మాట్లాడారు. ఈ సమ్మెకు పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, జనసేన లీగల్ సెల్ సభ్యులు అనుకూల రమేష్ని టిడిపి లీగల్ సెల్ ధనుంజయ మద్దతు తెలిపారు.

మూడో రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికులు

తాడేపల్లిగూడెం : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన సమ్మె మూడో రోజు కొనసాగింది. ఈ మేరకు కార్మికుల చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.సతీష్, ధనాల రాజు, నీలాపు ధనరాజు, అల్లం పూర్ణిమ, కె.దయామని నాయకత్వం వహించారు.

ఆకివీడు : జగన్మోహన్‌రెడ్డి హామీలు నెరవేర్చకపోగా సమ్మె చేస్తున్న వారిని బెదిరిస్తున్నారని ఇది సమంజసం కాదని మున్సిపల్ కార్మిక సంఘం యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కార్యదర్శి ధనాల వెంకటరావు అన్నారు. నగర పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు, అల్లాడి లక్ష్మీనారాయణ, సిమ్మ శీను, కేతా శీను, ధనాల చిన్న, లక్ష్మి పాల్గొన్నారు. శిబిరాన్ని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విజయకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

భీమవరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

అడుగడుగునా ఆంక్షలే..!

సిఎం పర్యటన నేపథ్యంలో భీమవరంలో హడావిడి

రోడ్డుకు ఇరువైపులా భారికేడ్లు ఏర్పాటు

స్థానికులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - భీమవరం

నిత్యం రద్దీగా ఉండే భీమవరం కబంధహస్తాల్లో చిక్కుకుంది. ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథ్యంలో చేస్తున్న హడావుడీతో స్థానికులకు, వ్యాపారులకు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రెండు రోజుల నుంచి పరిస్థితి ఇలాగే కొనసాగుతున్నప్పటికీ గురువారం మరిన్ని ఆంక్షలు విధించడంతో అవస్థలు రెట్టింపయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా భారీగేట్లు ఏర్పాట్లు చేశారు. రైల్వే అండర్ పాస్ గోడలతో పాటు ఇతర వంతెనలకు వైసిపి రంగులు పూశారు. దీనిపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణమంతా వైసిపి జెండాలతో అలంకరించి రంగులు మాయం చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లూథరన్ హై స్కూల్ క్రీడా మైదానంలో ల్యాండ్ అవుతున్న నేపథ్యంలో అక్కడ 200 ఏళ్ల నుంచి చెట్లను అధికారులు నిర్ధాక్షిణ్యంగా నరికి పారేశారు. అలాగే రోడ్డు పొడవున ఉన్న భారీ వృక్షాల కొమ్మలను సైతం తొలగించారు. దీనిపై వివిధ రాజకీయ పార్టీలు, ప్రకృతి ప్రేమికులు సైతం అధికారులు వ్యవహరించిన తీరు పట్ల మండిపడ్డారు. ఇదిలా ఉంటే సిఎం పర్యటన సందర్భంగా విధించిన నిబంధనలు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లూథరన్ హైస్కూల్ క్రీడామైదానం నుంచి బహిరంగ సభ వేదిక వరకూ వెళ్లే సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర నిషేధిత వాతావరణం కనిపిస్తున్న పరిస్థితి ఉంది. శుక్రవారం మరిన్ని ఆంక్షలతో పట్టణమంతా వెలవెలపోయే పరిస్థితి. రైల్వే అండర్పాస్ నుంచి బివి.రాజు విగ్రహం వరకూ తాడేపల్లిగూడెం రోడ్డులో భారీ ఇనుప గేట్లను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చిరు వ్యాపారులు అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. బైపాస్ రోడ్డులో యనమదుర్రు వంతెన నుంచి బహిరంగ సభ ప్రాంగణం వరకూ పటిష్టమైన భద్రతతో కూడిన ఆంక్షలు విధించారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకూ రెండున్నర కిలోమీటర్ల మేర అంత నిషేధిత ఆంక్షలు అమలు చేసే యోచనలో జిల్లా అధికార యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వ్యాపార రంగాల్లో ప్రధానంగా ఉన్న భీమవరంలో ఇటువంటి చర్యలకు పాల్పడితే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుందనే సందిగ్ధత కూడా కొనసాగుతోంది.

ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల వంటావార్పు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారానికి తొమ్మిదో రోజుకు చేరింది. భీమవరంలోని విస్సాకోడేరు వంతెన వద్ద ఏర్పాటుచేసిన నిరసనలో భాగంగా గురువారం వంటావార్పు చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొని వారి సమ్మెకు మద్దతు తెలిపి రూ.30.000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా యూనియన్‌తో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజారామ్మోహన్ రాయ్, జెఎసి అధ్యక్షులు భావాజీ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా సభ్యులు రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

దళితపేటల్లో శ్మశానవాటికలు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

భీమవరం రూరల్: జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్ జిల్లాలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై కార్యాచరణ ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన తిరిగి అధికారంలోకి రావడానికి చేసే పర్యటనగా ఉందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కార పర్యటనగా మాత్రం కనబడడం లేదన్నారు. జిల్లాలో కాలుష్యం పెద్ద సమస్యగా ఉందన్నారు. కాలుష్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డెల్టా ఆధునికీకరణ పనులు ఏళ్ల గడుస్తున్నా కనీసం పూర్తి కాలేదని విమర్శించారు. పంటలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తుపానుకు రైతులందరూ నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవడానికి పరిహారం, ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జిల్లాలో ఎక్కువ గ్రామాల్లో దళితులు శ్మశానవాటికల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ప్రతి దళితపేటకూ రెండెకరాల భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు 15 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మరో వైపు మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు ఆందోళనలు చేస్తున్నారని, వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

1 నుంచి పెన్షన్ రూ.3 వేలకు పెంపు

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నూతన సంవత్సరం జనవరి 1 నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద సామాజిక పెన్షన్లను రూ.2750 రూపాయల నుంచి రూ.3000లకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, నిరుపేదలకు గొప్పవరమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా తదితర పథకాల అమల్లో సన్నద్ధతపై ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి మోషేనురాజు తిలకించారు. కొత్త సంవత్సరంలో నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభిస్తున్నామని ఒకటి రూ.2750 నుండి 3000 వేల రూపాయలకు పెన్షన్ పెంపు, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, విజయవాడలో సుమారు 19 ఎకరాలలో 404 కోట్ల రూపాయలతో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించడం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. మండలాల్లో జరిగే కార్యక్రమాలలో శాసన సభ్యులు, అధికారులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మహావీరుడు పాపన్న గౌడ్ : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహావీరుడని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నీలాద్రిపురంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని గురువారం మంత్రి కొట్టు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మొగల్ చక్రవర్తులను ఎదిరించి వీరోచితంగా పోరాడిన పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. అణగారిన బడుగు బలహీన వర్గాల తరపున కొన్ని వందల సంవత్సరాల క్రితమే పోరాడిన చరిత్ర పాపన్న గౌడ్ ది అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. తన చేతుల మీదుగా పాపయ్య గౌడ్ విగ్రహాలు మూడింటిని ఆవిష్కరించడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ సభలో ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, నీలాద్రిపురం సర్పంచి రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఉపసర్పంచి రామారావు, దాసరి రాంబాబు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొట్టు

ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలి
సబ్ డివిజన్ పోలీస్ అధికారి త్రినాధ్

ప్రజాశక్తి - భీమవరం

ముఖ్యమంత్రి జగన్ జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భీమవరంలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలు తప్పకుండా పాటించాలని భీమవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారి బి.త్రినాధ్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి
యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యార్థులు చదువులో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అన్నారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 142 మంది విద్యార్థులకు రూ.8 వేల విలువైన యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్‌ను జిల్లా అధ్యక్షులు విజయరామరాజు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి యుటిఎఫ్ నిరంతరం కషి చేస్తుందన్నారు. విద్యార్థులు దీనిని అందిపుచ్చుకుని విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణప్రసాద్, రమణరాజు, త్రిమూర్తులు, సుధాకర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట గ్రామంలో గురువారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ నరసింహప్రసాద్ ప్రారంభించి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట గ్రామ సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బొక్కు అప్పారావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మండలంలోని శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ప్రారంభించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి కబడ్డీ క్రీడాకారులతో కాసేపు సరదాగా కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి దిడ్ల మనివజ్రం, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, మండల కన్వీనర్ ప్రభాకర్, నడపన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని కొమ్ము చిక్కాల జిల్లా పరిషత్ హైస్కూల్లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిడిఒ డి.సుహాసిని, ఎంపిపి సుమంగళి సాగర్ పాల్గొన్నారు.

బాలోత్సవం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ప్రప్రథమంగా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న భీమవరం బాలోత్సవాన్ని ఉపాధ్యాయులు, మేధావులు, సాహితివేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు, ఎన్‌జిఒలు జయప్రదం చేయాలని భీమవరం బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30, 31వ తేదీల్లో చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో బాలోత్సవం ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని గుర్తించి బాలోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల్లో సాహిత్యం, కళల పట్ల అవగాహన, ఆసక్తి, నైపుణ్యాన్ని సృజనాత్మకతను తీసుకురావడానికి, ప్రోత్సహించడానికి భీమవరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్స్ విద్యార్థులతో పాటు చుట్టుపక్కల ఆరు మండలాల పరిధిలోని విద్యార్థులతో బాలోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు జి.జేమ్స్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ చైతన్య ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పి.సీతారామరాజు పాల్గొన్నారు.

'పేదలకు అండగా కాంగ్రెస్'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కాంగ్రెస్ పార్టీ పాలనలో పేద, బడుగు, బలహీనులకు అండగా నిలిచిందని పార్టీ జిల్లా అధ్యక్షులు మార్నిడి బాబ్జి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 139వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ భారతదేశం అగ్రదేశాలతో పోటీగా నిలబడే శక్తికి కాంగ్రెస్ పార్టీ పాలనే కారణమన్నారు. భారత దేశ విద్యార్థులు ప్రపంచ దేశాల్లో మంచి స్థితిలో ఉండటానికి కారణం రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బాల బొమ్మల శ్రీనివాస్, పెంటపాడు మండల అధ్యక్షులు పాలూరి శ్రీనివాస్, అప్పారావు పాల్గొన్నారు.

జనవరిలో నరసాపురం - హుబ్లీ రైలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉభయగోదావరి జిల్లాల ప్రయాణికులు, వివిధ వాణిజ్య సంఘాలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నరసాపురం నుంచి హుబ్లీ వెళ్లే రైలు జనవరి మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే డిఆర్‌సి సభ్యులు జక్కంపూడి కుమార్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. జనవరి మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'వైసిపిని వ్యతిరేకిస్తున్న ప్రజలు'

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో గురువారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన టిడిపి, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అమలు జరిపే సంక్షేమ పథకాలతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తుంటే ప్రజలు, మహిళలు, పేదల నుంచి మంచి స్పందన కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు ప్రెసిడెంట్ కళాబత్తుల బాబూరావు, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర సెక్రటరీ పెచ్చెట్టి బాబు, జనసేన కన్వీనర్ సిద్దిరెడ్డి అప్పారావు, యూనిట్ ఇన్‌ఛార్జి మహమ్మద్ జానీ, కోటి రాంబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - ఉండి

మహిళను ఏమార్చి ఆమె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటనపై ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉండి ఎఎస్ఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు మండలంలోని ఆలపాడు గ్రామానికి చెందిన శాఖమూరి ధనలక్ష్మి గురువారం భీమవరంలోని శివశంకర్ హాస్పిటల్‌కు వైద్యం నిమిత్తం వెళ్లి వైద్యం చేయించుకుని తిరిగి ఆలపాడు వెళ్లేందుకు బయటకు వచ్చింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి "ఈరోజు బస్సులు, ఆటోలు తిరగడం లేదని, నేను ఉండి వరకు వెళ్తున్నానని, ఉండిలో దింపుతాను" అని చెప్పి శాఖమూరి ధనలక్ష్మిని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో మహాదేవపట్నం రోడ్డు వైపునకు మళ్లించి అక్కడే ఉన్న మద్యం గోడౌన్ పక్కనే ఉన్న రోడ్డులోకి తీసుకువెళ్లి తాను రూట్ మార్చిపోయానని, బైకు దిగాలని చెప్పి ధనలక్ష్మి మెడలో ఉన్న రెండు కాసుల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

పలువురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా అనుమానిత బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు ప్రొఫెషనల్ డిఎస్‌పి కె.అరవింద్ తెలిపారు. ప్రతి ఏడాది జరిగే సంక్రాంతి పండుగ సందర్భంగా గత నాలుగు రోజులుగా పాత బైండోవర్ కేసులు నమోదు చేయడమే కాకుండా కోడి పందేల స్థావరాలను గుర్తించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

స్పందించే వరకూ సమ్మె

17వ రోజుకు అంగన్‌వాడీల ఉద్యమం

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారంతో 17వ రోజుకు చేరుకుంది. గురువారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. సిఎం జగన్‌కు ఉత్తరాలను పోస్ట్ చేసి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు యుటిఎఫ్ గురువారం సంఘీభావం తెలిపింది. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మద్దతు తెలిపి సమ్మెలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు.

భీమవరం రూరల్ : భీమవరంలో అంగన్‌వాడీలు పోస్ట్‌కార్డులు పంపించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.విజయలక్ష్మి, రాజేశ్వరి, రామలక్ష్మి, భాగ్యలక్ష్మి, విమల, కనకరత్నం పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలో అంగన్‌వాడీలు ఉత్తరాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్‌డి.హసీనాబేగం మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు సిఎం జగన్‌కు నేరుగా తెలియజేయడానికి ఉత్తరాలు పోస్టు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల నాయకులు బి.రామకోటి, ధనలక్ష్మి, బండారు మహాలక్ష్మి, కల్యాణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో...

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో పోస్ట్ కార్డు ద్వారా తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, మహేశ్వరి, జి.కమల, వెంకటలక్ష్మి, పి.పద్మ, సత్యవతి, గౌరీశ్వరి, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : స్థానిక కోర్టు వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, అంగన్‌వాడీ నాయకులు గార రంగారావు, అనుకుల రమేష్, కవురు వెంకటేశ్వర్లు, రాజకుమారి, మణి మాలతి, ప్రమీల, కనకదుర్గ, వసంత కుమారి, రజని, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షల్లో భాగంగా పాటలు పాడి నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉత్తరాలను పోస్టు డబ్బాలో వేసి నిరసన తెలిపారు. ఈ దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి బల్లా చిన్న వీరభద్రరావు, మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, మల్లుల గణపతి, షేక్ బాదుషా సంఘీభావం తెలిపారు.

కాళ్ల : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు పోస్టుకార్డులు రాసి సిఎంకు పోస్ట్ చేశారు. పోస్ట్ కార్డులతో చేత పట్టుకుని తహశీల్దార్ కార్యాలయం నుంచి పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ప్రాజెక్ట్ లీడర్ దావులూరి మార్తమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ ఝాన్సీరాణి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకట గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక అంగన్‌వాడీ సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీలు పోస్ట్‌కార్డుల ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రదర్శనగా వెళ్లి ఉత్తరాలను పోస్ట్ బాక్స్‌లో వేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పారావు, అంగన్‌వాడీ నాయకులు పైడేశ్వరి, కనకదుర్గ, శివలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

ఇరగవరం : ఇరగవరంలో పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి మాటాడారు. ఈ కార్యక్రమంలో శ్యామల, నాగలక్ష్మి, ప్రభావతి, సత్యకుమారి, దుర్గ, అమరావతి, జయలక్ష్మి, విజయలక్ష్మి, గంగాభవాని, రత్నకుమారి పాల్గొన్నారు.

పోడూరు : సిఎం జగన్‌కు పోస్ట్ కార్డుల ద్వారా తమ సమస్యలు వివరిస్తూ ఉత్తరాలు రాసి పోస్టాఫీసులో పోస్ట్ చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డి.కల్యాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు వై.రాణి, ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి,రాయుడు కుమారి పాల్గొన్నారు.

పాలకొల్లు : తమ సమస్యలు పరిష్కరించాలని సిఎం జగన్‌కు ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు.

మొగల్తూరు : సమ్మె శిబిరాన్ని ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు

పెనుగొండ : పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ లీడర్ కె.తులసి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రజాపరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ తులసీరావు, వ్యవసాయ కార్మిక సంఘం పెనుగొండ మండల కార్యదర్శి షేక్ బాదుషా సంఘీభావం తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగంశెట్టి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్‌కు తమ సమస్యలు తెలుపుతూ పోస్ట్ కార్డులను పంపుతున్నామన్నారు. అనంతరం పోస్ట్ కార్డులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి ఉన్నారు.

వీరవాసరం : వీరవాసరం అంగన్‌వాడీ శిబిరం టెంట్లను గురువారం రాత్రి ఎవరో కొంత మంది కూలదోయడంలో వీరవాసరం మండల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. టెంట్ కూలదోయడంలో వారు వీరవాసరం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

తణుకు రూరల్‌లో...

యూనియన్ అధ్యక్షురాలు నాగరత్న మాట్లాడుతూ ఇటువంటి కవ్వింపు చర్యలు మానుకోవాన్నారు. కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. టెంటు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజరామ్మోహన్‌రాయ్, సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి శిబిరం వద్దకు వచ్చి టెంట్ కూల్చివేతపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో యాళ్లబండి నారాయణమూర్తి, బొర్రా ఆలమహారాజు, తోట నరసింహారావు, తాళ్లూరి రాము పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తహశీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ పోస్టాఫీసు వరకు ర్యాలీగా వెళ్లి ముఖ్యమంత్రికి రాసిన ఉత్తరాలను పోస్టడబ్బాలో వేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు దీన స్వరూపరాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకట దుర్గారావు, ప్రభారాణి, కనకమహాలక్ష్మీ, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక తపాలా కార్యాలయం వద్ద ఉన్న పోస్ట్‌బాక్స్‌లో ఉత్తరాలు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘ నాయకులు రజిని, దేవి, పద్మశ్రీ నాయకత్వం వహించారు.

ప్రజాసంఘాల నేతలకు, ఆశావర్కర్లకు నోటీసులు

ఉండి : భీమవరంలో సిఎం పర్యటన సందర్భంగా ఉండి మండలానికి చెందిన పలువురు వామపక్ష నాయకులకు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులకు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులకు, యుటిఎఫ్ నాయకులకు, బిజెపి నాయకులకు ఉండి పోలీసులు ముందస్తు నోటీసులు గురువారం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం ఉండి మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ముందస్తు నోటీసులు, గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, సమ్మెలో పాల్గొన్న కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు వారికి న్యాయం చేయాలన్నారు.



ఆచంట : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం భీమవరం విచ్చేస్తున్న సందర్భంగా ముందస్తుగా ఆచంట ప్రజా సంఘ నాయకులకు నోటీసులు జారీ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, ఆశావర్కర్ల మండల అధ్యక్షురాలు నక్క శైలజలకు ఆచంట పోలీసులు నోటీసులు జారీ చేసి సుమారు అరగంటసేపు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా కలెక్టర్ ప్రశాంతి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కలెక్టర్ ప్రశాంతి పుట్టినరోజు వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వశిష్ట వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, జిల్లా వివిధ శాఖల అధికారుల సమక్షంలో కలెక్టర్ ప్రశాంతి కేక్ కట్ చేసి చేశారు. ఆమెకు పూల బోకేలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరు ఛాంబర్‌లో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, నరసాపురం పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, కలిసి పూల బోకెలు అందించి జిల్లా కలెక్టరుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కిషోర్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఆచంట

హైదరాబాద్ రవీంద్ర భారతిలో యువ కళావాహని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆచంటకు చెందిన ప్రముఖ రచయిత, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్‌ను ప్రముఖ సినీ నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ మురళీమోహన్ శాలువాకప్పి, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ అధినేత ఐ.వరప్రసాద్‌రెడ్డి, యువ కళా వాహిని అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, ఓలేటి పార్వతీశం, సినీ విజ్ఞాన విశారద ఎస్‌వి.రామారావు, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత దాసరి వెంకట రమణ పాల్గొన్నారు.

'టిడిపితోనే అర్హులకు లబ్ధి'

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని, తెలుగుదేశం పార్టీతోనే ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. ఉండిలో గురువారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ ఇంటికి వెళ్లినా రాష్ట్ర ప్రభుత్వం కరెంటు బిల్లును కొలమానంగా చూపించి సంక్షేమ పథకాలు నిలుపుదల చేశారని మహిళలు వాపోయారన్నారు. పూర్తిస్థాయిలో సాగు, తాగునీరందించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కెడుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, గ్రామపంచాయతీ అధ్యక్షులు కాగిత సత్యనారాయణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

పిసిసి జాయింట్ సెక్రటరీ, కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉండి మెయిన్ సెంటర్‌లోని కాంగ్రెస్ స్థూపం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు, కాంగ్రెస్ యూత్ జిల్లా మాజీ అధ్యక్షులు అంకెం సీతారాం మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించి వృద్ధులకు, పండ్లు, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షులు సోము నాగ కేశవబాబు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు వారాడ కొండలరావు, పార్టీ మండలాధ్యక్షులు కొల్లు సత్యశ్రీనివాస్, పార్టీ ఆకివీడు మండలాధ్యక్షులు చింతా ఆదిశేషు పాల్గొన్నారు.

గణపవరం : కాంగ్రెసు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిప్పరలో పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ పాతపాటి హరికుమార్‌రాజు ప్రారంభించారు. తొలుత కాంగ్రెస్ పతాకాన్ని ఎగురవేసి మహాత్మగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ 2 అధ్యక్షులు యర్రంశెట్టి ఏడుకొండలు, మండలాధ్యక్షులు చంద్రశేఖర్, బ్లాక్ 1 అధ్యక్షులు పలివెల చంద్రబాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రంశెట్టి సాయినాగబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. తక్షణమే విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే జనవరి ఐదో తేదీ తర్వాత సమ్మెలోకి వెళ్లడం ఖాయమని చెప్పారు. విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మీసాల కృష్ణమూర్తి, రావూరి మాణిక్యాలరావు, రుబియమ్మ, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

పేదరిక నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి - ఉండి

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా తాము పాదయాత్ర చేస్తున్నామని రిటైర్డ్ కలెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం ఉండి మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐక్యత విజయపథం యాత్ర ద్వారా సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించి, సామాజిక అసమానతలు తొలగించి, రాజకీయ చైతన్యాన్ని రగిలించి, తరతరాలుగా అధిక జనులు కోల్పోయిన హక్కులు, ఆస్తులు, అవకాశాలు ఆకాంక్షలు సాధించడం కోసం ప్రజల్లో అవగాహన గెలిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి జులై 23వ తేదీన తిరుపతి జిల్లాలోని తడ నుంచి ఐక్యత విజయ పథం పాదయాత్రను చేపట్టి నేటికీ సుమారు 2200 కిలోమీటర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు వారి సతీమణి విజయశ్రీ పాదయాత్రలో పాల్గొంది.

జాబ్‌మేళాలో 26 మంది ఎంపిక

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ బ్యాంకింగ్ ఐటి కంపెనీల్లో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఎన్ఐఐటి, యాక్సిస్ బ్యాంక్, ఫోన్ పే కంపెనీలు పాల్గొన్నాయి. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి 82 మంది హాజరవ్వగా 26 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారిలో తొమ్మిది మంది ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు ఉన్నారు. వారిని ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు అభినందించారు. వీరికి జీతం ఇతర ఎలివేన్స్ కలిపి నెలకు రూ.40 వేలు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు, సెక్రటరీ రామరాజు హాజరయ్యారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి
కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణరావు మాట్లాడుతూ 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉంటే సంక్షేమ బోర్డులో కేవలం 19.80 లక్షల మందిని మాత్రమే నమోదు చేసుకున్నారని, వారిలో చాలామందికి నేటికీ గుర్తింపు కార్డులు ఇవ్వలేదని చెప్పారు. కార్మికులకు సంక్షేమ పథకాలు ఆపేస్తూ ఇచ్చిన మెమో 12 14 రద్దు చేయాలని, 60 ఏళ్ల కార్మికులకు రూ.ఐదు వేలు పెన్షన్ ఇవ్వాలని, బిల్డింగ్ రంగం మెటీరియల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం, పసుపులేటి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, మండా సూరిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఎంఎల్‌సి రవీంద్రనాథ్‌ను కలిసిన పృథ్విరాజు

రవీంద్రనాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పృథ్విరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్‌ను విస్సాకోడేరు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత పిన్నంరాజు పృథ్వీరాజు గురువారం తణుకులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్‌సికి పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి, ప్రతిపక్షాల కుట్రలను ఎలా తిప్పికొట్టాలనే అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 20వ వార్డు సచివాలయంలో వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కార్డులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, 20వ వార్డు ఇన్‌ఛార్జి కొరగంజి శ్రీనివాస్, దొంగ సత్తిబాబు పాల్గొన్నారు.

'బిజెపి సంకల్ప యాత్రను నమ్మొద్దు'

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బిజెపి మరో మోసానికి తెరతీసిందని కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పిసిసి సంయుక్త కార్యదర్శి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు విమర్శించారు. ఉండి మెయిన్‌సెంటర్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గోపాలకృష్ణంరాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అంకెం సీతారాం మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడం తప్ప బిజెపి దేశంలో చేసిన అభివృద్ధి లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షులు సోము నాగ కేశవబాబు, పార్టీ మండల అధ్యక్షులు వారాడ కొండలరావు, కాంగ్రెస్ బ్లాక్ మండలాధ్యక్షులు అడబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ. 7,98,056

ప్రజాశక్తి - మొగల్తూరు

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.7,98,056 వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. గత 49 రోజులుగా యాత్రికులు కానుకలు, మొక్కుబడుల రూపంలో అమ్మవారికి సమర్పించుకున్న హుండీ ఆదాయాన్ని నరసాపురంలోని రాజగోపాలస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి పులగం వేణుగోపాలరావు పర్యవేక్షణలో లెక్కించామని ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో గ్రామస్తులు, సేవాకర్తలు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినది

పంద్రాజు లక్ష్మి అను నేను మాదేపల్లి గ్రామములో నివసించుచున్నాను. నా యొక్క లింకు దస్తావేజు నెం.4064/2004 & రెండవ దస్తావేజు నెం.8047/2002 ఏలూరు లోని బిర్లాభవన్ సెంటర్ సమీపంలో పోయినవి. సదరు రెండు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియపర్చగలరు.

పంద్రాజు లక్ష్మి,
సెల్ : 8096727997

పాస్‌పోర్ట్ పోయినది

రాపాక శరమ్మ, భర్త : సురేష్‌కుమార్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పెనుగొండ నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. M1541170 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : రాపాక శరమ్మ, భర్త : సురేష్‌కుమార్ రాజుగూడెం, పెనుగొండ మండలం, ప.గో.జిల్లా పిన్ - 534320, సెల్ : 8184827381